కామ్రేడ్ కుమార్ సంస్మరణ సభ

విశాలాంధ్ర - మధురవాడ : ఈటీవల మృతీ చెందిన జీవీఎంసీ 7వ వార్డు పాత మధురవాడ మెట్ట సీపీఐ శాఖ కార్యదర్శి కామ్రేడ్ కుడిపూడి అరుణ్ కుమార్ సంస్మరణ సభను సోమవారం వారి స్వగృహం వద్ద నిర్వహించారు. పాత మధురవాడలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కొన ఊపిరి ఉన్నంత వరకు నిబద్దతో పని చేసిన నిజాయితీ గల కామ్రేడ్ కుమార్ అని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు మరుపిళ్ల పైడిరాజు ఆ పార్టీ నాయకులు కొల్లి మేఘూరావు, జి.వేళంగినిరావు ఆటో కార్మికులు, బంధువులు, స్నేహితులు, మిత్రులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.

పోర్టు ఎస్సీ,ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

జి. ఉమామహేశ్వరరావు అధ్యక్షులు
ఎం. దేవీశ్వరరావు ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఎస్సీ ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం పోర్టు ఏరియాలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులుగా జి.ఉమామహేశ్వరరావు, ఎం.దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశా ధికారిగా ఎం.సాల్మన్ రాజు, ఉపా ధ్యక్షులుగా డా.టి.ఎస్.దీప్తి, కె.వేణుగోపాల్, ఈ. వెంకట్రావు, పి.ప్రసన్న కుమార్, సంయుక్త కార్య దర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, కె.సిద్ధార్థ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎమ్.ఎస్.రావు, బూరి శ్రీను, ఎ.సంజీవరావు, కె.వి.రమణలతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ మెంబర్ ఎం.ఎన్.ఎస్. ఎస్. సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తామని తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీలో పనిచేస్తున్న ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని పరిష్కరించి నందుకు ఈ సందర్భంగా యాజమాన్యానికి ధన్య వాదాలు తెలిపారు. నగరంలోని అత్యంత ఎత్తైన ప్రతిష్టాత్మక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని కాన్వెంట్ జంక్షన్‌లో పోర్టు సహకారంతో నెలకొల్పి, అంబేద్కర్ సర్కిల్‌గా నామకరణ చేసిన ఘనత అసోసియేషన్ దక్కిందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎం. దేవీశ్వరరావు మాట్లా డుతూ రిజర్వేషన్ల పరిరక్షణ కోసం అసోసియేషన్ కృషి చేస్తుందని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందరి హక్కులను కాపాడిన హక్కుల పరి రక్షకుడని పేర్కొన్నారు. పోర్టులో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాలు భర్తీ, ప్రమోషన్లు ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

కొనసాగిన యోగాభ్యాసన కార్యక్రమాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జూన్ 21న విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సన్నాహాల్లో భాగంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాలు జిల్లాలో ఉత్సా హంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆరో రోజు పలు చోట్ల ఔత్సాహికులు యోగాసనాలు వేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్స్ లో పాల్గొన్న విద్యార్థుల చేత జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు యోగాభ్యాసన ప్రక్రియలు నిర్వహించారు. గోపాల పట్నం ఇండోర్ స్టేడియం, శొంఠియాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో జరుగుతున్న సమ్మర్ క్యాంపులను యోగా వేదికలగా మార్చి ప్రత్యేక తర్ఫీదు అందించారు. అలాగే స్థానిక ఆర్. కె. బీచ్ సమీపంలో ఉన్న యోగా విలేజ్ లో సోమవారం ఉదయం నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు జరిగాయి. అభ్యాసకులు, యోగా గురువులు, వివిధ యోగా అసోసియేషన్ల సభ్యులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలం, రూ.5 లక్షలు మంజూరు చెయ్యాలి

సీపీఐ డిమాండు

విశాలాంధ్ర - మధురవాడ : కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పట్ట ణాలలో అర్హులైన పేదలందరికీ 02 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చిఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు తో పాటు సూపర్ సిక్స్ హామీలు అమలు చెయ్యాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుల మరుపిళ్ల పైడిరాజు డిమాండు చేశారు. సోమవారం దీనికి సంబంధించి మధురవాడ 7వ వార్డు మల్లయ్యపాలెం లో గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చెయ్యాలనే డిమాండుతో జూన్ 2న విశాఖ రూరల్ మండల కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని,ఇళ్లు కోసం వ్యక్తిగత దరఖాస్తులు చేసుకున్న ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లి రాములమ్మ, ఆదిలక్ష్మిలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

జీవీఎంసీ పార్క్ స్థలాలను కాపాడండి

జిల్లా కలెక్టర్‌కు సామాజిక కార్యకర్త రజిని వినతి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జీవీఎంసీ జోన్ -2, మధురవాడలోని ప్రభుత్వ పార్కు స్థలాలు కబ్జాకు గురై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాటిని కాపాడాలని వినతి పత్రం పలు మార్లు ఇచ్చినా పట్టించుకోవడంలేదని సామాజిక కార్యకర్త చేకూరి రజిని అన్నారు. సోమవారం ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఏడవ వార్డు బొట్టవానిపాలెంలో ఈడబ్ల్యూఎస్ లేఔట్, స్వతంత్ర నగర్‌లో సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం గతంలో జీవీఎంసీ పార్కు అభివృద్ధి చేసిందన్నారు. పార్కులోని 150 గజాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆలయం పేరుతో కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. దీనిపై ఈ నెల 5న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, దీంతో ఈ నెల 19న జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందించానని చెప్పారు. అధికారులు పట్టించుకోలేదని పైగా సమస్య పరిష్కారమైనట్టు సమాచారం వచ్చిందని వివరించారు. అదే విధంగా ఏడో వార్డులోని కళానగర్ లో గల జీవీఎంసీ కృష్ణ నగర్ పార్కును కూడా కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. స్వతంత్ర నగర్ లోని బ్రహ్మంగారి గుడి ఎదురుగా గల మరో జీవీఎంసీ పార్కు స్థలాన్ని కూడా కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. వీటికి అనధికారికంగా కరెంటు మీటరలను కూడా వేసేసారని వెల్లడించారు. కబ్జాలను అరికట్టి ప్రభుత్వ పార్కు స్థలాలను కాపాడాల్సిన అక్కడి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆక్రమణదారులకు మద్దతుగా వాటికి శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని పార్కులను కాపాడాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 పోలాకి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు 33/11కెవి బాకురుపాలెం ఫీడర్ మరమ్మత్తులు నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో బాకురుపాలెం, ఇచ్చాపురం, చిన్నయ్య పాలెం, రాము నాయునీపేట, రేగాని గూడెం, ముకుందపురం కాలనీ తదితర ప్రాం తాలకు గృహ వినియోగదారులకు పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆనందపురం ఎలక్ట్రికల్ ఏఈ మండల. అప్పలనాయుడు తెలిపారు.

11 మంది మందుబాబులకు జరిమానా!

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందికి కోర్టు, లక్ష పదివేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరాజు తెలియజేశారు. పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించగా 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి 10 వేల చొప్పున మొత్తం లక్షా 10 వేల జరీమానా విధించారని తెలిపారు. నిబంధనలు దిక్కరించి మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరాజు హెచ్చరించారు.

రామారావు మృతి సీపీఐ పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : గాజువాక మార్కెట్ సంఘం అధ్యక్షుడు, సిపిఐ పార్టీ సభ్యుడు ఎం. రామారావు అనారోగ్యం తో ఆకస్మిక మృతి చెందడం సిపిఐ పార్టీ కి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ అన్నారు. సోమవారం రామారావు స్వగృహం వద్ద రామారావు పార్థివ దేహం పై పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ గాజువాక మార్కెట్ అభివృద్ధికి రామా రావు చేసిన సేవలు మరువ రాని దని కొనియాడారు .ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, న్యాయవాది ఏ.వి.లెనిన్, నాయకులు అప్పా రీ విష్ణు మూర్తి, పోలారావు, పప్పు అప్పారావు, కర్రి వేంకటేశ్వరరావు, సలీం, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు డాక్టర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాపురం : నిరంతరం పుస్తకాలను చదివి, తన జీవితాన్ని విద్యకు అంకితం చేసిన డాక్టర్ అంబేద్కర్ ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.వీ.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కా పురంలోని శాఖ గ్రంథాలయంలో బాలలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో సోమవారం ఆమె ప్రారంభ ఉపన్యాసం చేస్తూ - ఎన్నో కష్టాలను భరించి, అంబేద్కర్ భారత ప్రజలకు వెలుగు బాట చూపించారని అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని, తర్కాన్ని ఆయన నుండి అంతా నేర్చుకోవాలని ఆమె అన్నారు. అనంతరం అంబేద్కర్ జీవితంపై మరియు దేశాభివృద్ధిలో ఆయన పాత్ర పై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. బాలలు ఉత్సాహంగా ఈ చర్చలో పాల్గొన్నారు. దీని తరువాత కొన్ని బోధనా నమూ నాలను బాలల తయారు చేశారు. తమ సృజనాత్మకతను ఇందులో వ్యక్తం చేశారు. స్థానిక ప్రముఖులు కె.పాపారావు పెద్ద బాలశిక్ష పుస్తకాన్ని గ్రంథాలయానికి బహుకరించారు. తొలుత గ్రంథాలయాల పాత్రపై, వేసవి విజ్ఞాన శిబిరాలపై గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ బాలలకు సవివరంగా తెలియజేశారు. బాలలు తాము చదివిన కథలను ఇతరులకు చెప్పారు. ఈ కార్యక్రమాలన్నిటిని యూత్ లీడర్లు కె.హేమంత్, సునీత, జ్యోతిర్మయి సమన్వయ పరిచారు.

మా స్కూల్ టీచర్లను బదిలీ చేయొద్దు

విద్యార్థులు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు ఎంఈఓకు వినతి

విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభం మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అయినటువంటి ఆర్.సునీత, ఏ ఆది బాబులను బదిలీ చేయొద్దంటూ స్థానిక గ్రామ స్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అంతా కలిసి స్థానిక ఎంఈఓ ఆఫీస్ కు వచ్చి ఎంఈఓ కు వినతి పత్రం ఇవ్వడం జరిగినది. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు కొనసాగుతున్న సునీత మరియు ఆదిబాబులు మా పిల్లలకు ఎంతో చక్కటి విద్య బోధనలు నేర్పుతున్నారని ఆ ఉపాధ్యాయులను బదిలీపై పంపించవద్దని ఎంఈఓ ను వేడుకోవడం జరిగిందని, అలాగా కాని పక్షంలో ఇక్కడే ధర్నా చేస్తామని తెలియజేశారు. మంచి ఉపాధ్యాయులను వదులుకోవడం మాకు ఇష్టం లేదని వారన్నారు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో మరియు పిల్లల పట్ల శ్రద్ధతో విద్యాబోధనను నేర్పుతున్నారని మా పిల్లల భవిష్యత్తుకు బంగారబాటు వేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నాపురం గ్రామస్తులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పీఎంపాలెం : విద్యార్థుల భవిష్య త్తుతో ఆట్లాడుకున్న మధురవాడలో ఓ ప్రైవేట్ కళాశాల నిర్వాకంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంసెట్ విద్యార్థులకు షాక్ ఇచ్చిన మధురవాడ, పీ.ఎం.పాలెంలోని ప్రైవేట్ కళాశాల యాజ మాన్యంపై చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు. ఎంసెట్‌కి సంబంధించిన ఫేక్ హాల్ టికెట్లను తయారు చేసి విద్యార్థులకు అందించిన యాజమాన్యం గుర్తింపును వెంటనే రద్దుచేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం కళాశాల ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం స్పందించకపోవడంతో పీ.ఎం.పాలెం పోలీసులను బాధితులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. 5 మంది విద్యార్థులకు ఈ విధమైన ఫేక్ డూప్లికేట్ హాల్ టికెట్లు ఇచ్చినట్లు సమాచారం.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఉక్కు యాజమాన్యం విధుల్లోనుంచి తొలగించిన రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి షేక్ రహమాన్ ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 7 వ రోజుకు చేరుకుంది. సీపీఐ జిల్లా సమితి ప్రతినిధి బృందం కూర్మన్న పాలెం కూడలిలోనీ దీక్షా శిబిరం వద్ద కాంట్రాక్ట్ కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రహమాన్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విమర్శించారు. తొలగించిన కాంట్రాక్ట్ విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఉద్యమిస్తుందని అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, క్షేత్ర పాల్ రెడ్డి, జి.రాంబాబు, నాగభూషణం, మన్మథరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఆశావహులకు ఉచిత అవగాహన తరగతులు

విశాలాంధ్ర - పెందుర్తి : పాలిటెక్నిక్ చదవాలనుకునే విద్యార్థులకు నరవ బెహరా పాలి టెక్నిక్ కళాశాలలో పదిరోజుల పాటు ఉచిత నైపుణ్య శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సుకన్య తెలిపారు. జూన్ 2 సోమవారం నుండి 11 బుధవారం వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ తరగతులలో పాలిటెక్నిక్ కోర్సులో ఎన్ని బ్రాంచ్ లు ఉన్నాయి, ఇంట్రెస్ట్ ఉన్న బ్రాంచ్ పై ప్రత్యేక వర్క్ షాప్, కంప్యూటర్ పై వర్క్ షాప్, పర్సనాలిటీ డెవలప్మెంట్ కమ్యూ నికేషన్ స్కిల్స్ పై వర్క్ షాప్‌లు నిర్వహించ నున్నట్లు తెలియజేశారు. ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు గాజువాక, మద్దిలపాలెం, గోపాలపట్నం ప్రాంతాల నుండి ఉచిత బస్సులను ఏర్పాటు చేసామని పాలిటెక్నిక్ చదవాలనుకునే విద్యార్థులకు చక్కటి అవకాశమని ప్రతీ విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగపరచు కోగలరని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 84980 53328, 80969 51452, 80741 01825, 63039 53129 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యే పంచకర్లను సత్కరించిన రేషన్ డీలర్స్

విశాలాంధ్ర - పెందుర్తి : జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సోమవారం ఉదయం జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో రేషన్ డీలర్స్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చేనెల 1 నుండి రేషన్ డిపోల వద్ద కార్డు హోల్డర్స్ కు రేషన్ సరుకులు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్స్ అధ్యక్షులు చిట్టి రాజు, జిల్లా సెక్రెటరీ నాకేనా ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సేలా శ్రీనివాసరావు, సరగడం వెంకట్రావు, చెరుకూరి వెంకట్రావు, సత్యనారాయణ, రాము మహిళా ఆర్గనైజేషన్ తనుజ సహా వివిధ గ్రామాల రేషన్ డిపోల డీలర్స్ పాల్గొన్నారు.

ఈఓ బాధ్యతలు చేపట్టిన త్రినాథరావు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం కార్య నిర్వహణ అధికారిగా రీజనల్ జాయింట్ కమీషనర్, వెంద్ర త్రినాధరావు సోమవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలవు అనంతరము తిరిగి విధులకు హాజరైన సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు సోమవారం డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత నుండి, బాధ్యతలు స్వీక రించారు. తొలిత శ్రీ సింహాద్రినాదుని దర్శించుకున్నారు వీరికి ఆలయ సహాయకార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు ఆనంద కుమార్ ఆలయ అర్చకులు సీతారామాచార్యులు నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికి ముందుగా స్వామివారిని దర్శించుకుని అనంతరం ఆలయ వేద పండితులచే వేద ఆశీర్వచనం అనంతరము ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి పిల్లా శ్రీనివాసరావు ఎన్ ఆనంద్ కుమార్ స్వామివారి శేష వస్త్రముతోసత్కరించగా ఏఈఓ పిల్లా శ్రీనివాసరావు స్వామి వారి ప్రసాదము అంద జేశారు. ఈనెల 8వ తేదీన స్వామివారి స్వాతి నక్షత్రం రోజున అత్యంత వైభవంగా జరిపించుటకుగాను స్వాతి హోమంలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని ఈవో వెంద్ర త్రినాధరావు తెలిపారు. స్వాతి హోమం ఏర్పాట్లపై స్వామివారి కల్యాణ మండపం వివిధ విభాగాధిపతుతో కలసి పరిశీలించారు. వీరితో సహాయ కార్య నిర్వహణ అధికారి ఆనంద్ కుమార్, పిల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణ అధికారి జివిఎస్ కే.ప్రసాద్ త్రిమూర్తులు కంచి మూర్తి మూలా వాసను తదితరులు ఉన్నారు.

29న విమ్స్‌లో వైద్యుల పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్యుల ఉద్యోగాల భర్తీ కోసం ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసిందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా ఎటువంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ బట్టి ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు అని పేర్కొన్నారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 28 వైద్య పోస్టులను భర్తీకి అర్హత కలిగిన వైద్యులు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు. స్పెషాలిటీ వైద్యులు రూ.92,000 , సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ .1,60,000 వేతనంతో ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీన హనుమంతవాక వద్ద గల విమ్స్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఆసక్తిగల వైద్యులు తమ ఉత్తీర్ణత పత్రాలతో పాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు తీసుకొని హాజరు కావలసిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం http://dme.ap.nic.in వెబ్ సైట్ ను సందర్శించవచ్చున్నారు.

ఖాళీల వివరాలు : అనస్తీషియా-10, న్యూరో సర్జరీ-03, కార్డియాలజీ-2, ఎమర్జెన్సీ మెడిసిన్-2, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)-3, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ-1, మెడికల్ అంకాలజీ-1, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండోక్రైనాలజీ -1, పల్మనాలజీ-1, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ-1, జనరల్ మెడిసిన్ -2 మొత్తం 28 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి..గంభీరం రిజర్వాయర్లో ఘటన

విశాలాంధ్ర - ఆనందపురం : అనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో, సమీర్ (26) ఆదివారం సాయంత్రం సమయంలో గంభీరం రిజర్వాయర్లో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి దురదృష్టవ శాత్తు నీటిలో పడి మృతి చెందాడు. వివరాలకు వెళితే మారిక వలస ప్రాంతానికి చెందిన 4 గురు వ్యక్తులతో కలిసి చేపల వేటకు గంభీరం రిజర్వాయర్ వద్దకు వెళ్లారు, చేపలు పట్టే క్రమంలో సమీర్ అనే వ్యక్తి ప్రమాదవ శాత్తు నీటిలో జారి పడ టంతో ఈతరాని కారణంగా లోతైన నీటిలో మునిగి పోవడంతో మృతి మృతి చెందాడు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు, ఎస్టీఆర్ఎఫ్ , ఫైర్ సిబ్బంది, ఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. బాడీని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్ తరలించామని, పీఎం అయిన తర్వాత కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. సమీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నంబాళ్ల కేశవరావు ఇతరుల మృతదేహాలని బంధువులకు అప్పగించాలి

వామపక్షాలు , ప్రజా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, మిగిలిన నలుగురు మరణించి ఐదు రోజులు అయినప్పటికీ వారి మృతదేహాలను అప్పజెప్పమని ఏపీ హైకోర్టు ఆదేశించినప్పటికీ చత్తీస్గఢ్ ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం స్పందించడం లేదని,కుంటిసాకులు చెపుతూ భౌతిక కాయల్ని అప్పజెప్పకపోవడం దుర్మార్గ చర్య అని రాజ్యాంగ వ్యతిరేక చర్యని, మానవత్వాన్ని అపహాస్యం చేసినట్లేనని వక్తలు నిరసించారు. వెంటనే మంత్రి అచ్చం నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యత వహించి భౌతిక కాయలను రప్పించి అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ఒప్పందాల్లో మృతదేహాలను గౌరవ ప్రదమైనటు వంటి పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి అవకాశం కలిగిం చాలని చేసిన ఒప్పందాల మీద సంతకాలు చేసినటువంటి ప్రభుత్వాలు దాన్ని పట్టించుకోకపోవడం దుర్మార్గమని, సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో అంతిమ సంస్కారం నిర్వహించుకునే హక్కు కూడా జీవించే హక్కులో భాగమని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్యని నిరశించారు. రాజ్యాంగ మీద ప్రమాణం చేసి అధికరంలోకి వచ్చిన పాలకులు రాజ్యాంగాన్ని పట్టించుకోకుండా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గడ్చిరోలి ప్రాంతంలో 1,26,000 చెట్లను నరకడానికి దాదాపు 3000 ఎకరాలు అడవిని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పడానికి పూనుకున్న చర్య ఈ ప్రభుత్వాలు కార్పొరేట్లకు సకల సంపదలను అప్పజెప్పడానికి ఉన్నాయని విషయాన్ని నిర్ధారణ చేసిందని అన్నారు. అందుకే ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్నాయని, ఆదివాసీల పైన మావోయిస్టుల పైన హత్యకాండ కు పాల్పడుతున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు అమరుల భౌతిక కాయలను చెప్పాలని ఆపరేషన్ కగార్ ను ఆపాలని మావోయిస్టులతో శాంతి ఉద్యమకారులందరూ డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ విశాఖ విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి యస్ కె రెహమాన్, సిపిఎం విశాఖ జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి, పూర్వ విప్లవ విద్యార్థుల సంఘం ప్రతినిధులు యన్ రవి, యం సాంబమూర్తి, న్యాయవాదులు అబ్బాయి రెడ్డి, బ్రహ్మం పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం లక్ష్మి, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రతినిధి కే పద్మ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య అన్నపూర్ణ పాల్గొనగా ఈ నిరసన కార్యక్రమానికి విశాఖ జిల్లా సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి వి చంద్రశేఖర్ అధ్యక్ష వహించారు.

అసలు మీ వాహనంపై చలానా ఉందో లేదో ఒక్కసారైనా చూసుకున్నారా?

పాత చలానాల వసూళ్ల పనిలో ట్రాఫిక్ పోలీసులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్ : విశాఖ ట్రాఫిక్ పోలీసులు పాత పద్దులను వసూలు చేసుకునే పనిలో పడ్డారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి వాహనాలకు పోలీసులు విధించిన చలానాలు ఇంకా చెల్లించకుండా ఉన్న వారికి ట్రాఫిక్ పోలీసులు ఝలక్ ఇస్తున్నారు. పెండింగ్ చలాన్లను వెంటనే కట్టకపోతే వాహనాలను సీజ్ చేస్తామంటున్నారు చలాన కట్టని వారి పని పట్టేందుకు రంగంలో దిగారు విశాఖ పోలీసులు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి ఇప్పటికే ఆన్ లైన్ లో చలాన మెసెజ్ పంపించిన పోలీసులు. రోడ్లపైకి వచ్చిన ప్రతి వాహనాన్ని చెక్ చేస్తున్నారు. పెండింగ్ చలాన్లను అక్కడే కట్టించుకుంటున్నారు. బకాయి ఉన్న చలానాలు కచ్చితంగా చెల్లించాలనీ. లేనిపక్షంలో హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి వాహనాలు సీజ్ చేస్తామనీ దానితో పాటు సంబంధిత వాహన యజమాని డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని ట్రాఫిక్ పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ చలానాలను మీ సేవా కేంద్రం, ఈ-చలాన్ పరివాహన్ వెబ్‌సైట్, యాప్, సమీపంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గానీ చెల్లించాలని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

ఉన్నత లక్ష్యాలతో యువతరం ఎదగాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించాలని ఆర్ట్స్ కళాశాలప్రిన్సిపల్ ఆచార్యఏ.నరసింహారావు ఆకాంక్ష వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఏయు చిత్రకళా విభాగంలో ఏర్పాటు చేసిన బిఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శనను ఆయన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ఉన్నత విద్యను శతాబ్ది ఉత్సవాలు జరుపు కుంటున్న ఆంధ్ర విశ్వకళా పరిషత్లో అభ్యసించడం గర్వకారణమని చెప్పారు. విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యాలతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్ది ప్రదర్శించడం పట్లసంతోషం వ్యక్తంచేశారు. విద్యార్థులు ఇక్కడనేర్చుకున్న అంశాలను కార్యరూపంలో చూపుతూ తీర్చిదిద్దిన శిల్పాలు, చిత్రాలు అత్యుత్తమంగా నిలుస్తున్నాయని చెప్పారు.

అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి చీఫ్ ఇంజినీరు వరకూ..

ప్రాజెక్టుల రూపకల్పన అభివృద్ధిలో జీవీఎంసీ సిఈ శివప్రసాదరాజుది ప్రత్యేక ముద్ర

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఉత్తమ ఇంజినీరుగా రాణించడమంటే సృజనాత్మకత... నిబద్ధత.. పర్యవేక్షణ.. సమయ పాలన ఎంతో కీలకం. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల అమలు శాస్త్రబద్ధంగా సాగాలంటే.. తలెత్తే సమస్యల పరిష్కారానికి అవసరమైన నైపుణ్యం కూడా అంతే కీలకం. నాలుగు దశాబ్దాలుగా ఇంజినీరింగ్ రంగంలో ప్రధానమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ వస్తోన్న మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) చీఫ్ ఇంజినీరు పెన్మత్స శివప్రసాద రాజు ప్రయాణం విజయాల వైపు నడిపిస్తూ సమాజ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించింది. విశాఖపట్నం నగర ప్రజలకు తాగునీరందించే అత్యంత ప్రధానమైన రైవాడ వాటర్ సప్లయి స్కీంను 1994లో రూ.342 కోట్లతో చేపట్టిన ఘనతలో అప్పటి ఇంజినీరుగా పనిచేసిన నేటి చీఫ్ ఇంజినీరుది ప్రధానమైనదిగా చెప్పొచ్చు. ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయబోతున్న ఆయన్ని విశాలాంధ్ర పలుకరించగా తన ఉద్యోగ ప్రస్థానంలోని పలు విషయాలను, విశేషాలను తెలియజేశారు. ఇంజినీరుగా అనేక ప్రాజెక్టులను పూర్తి చేయడం సంతృప్తిగానే అనిపించిందన్నారు. అయితే విద్యార్థి దశలో ఉన్నప్పుడు డాక్టర్ (వైద్య వృత్తి)లో స్థిరపడాలని ఇంటర్లో బైపిసి తీసుకున్నారని, కానీ ఇంజినీరు అయ్యానన్నారు. ఏలూరు సిఆర్ఆర్ కాలేజీలో ఒక అధ్యాపకులు మేథమేటిక్స్ లో మంచి మార్కులు వచ్చాయని, డాక్టర్ ఎందుకు, ఇంజినీరింగ్ చదవాలని చేసిన ఒత్తిడి నా మనసుపై పడిందన్నారు. ఇంజినీరింగుపై ఇష్టం లేకపోయినా చేరాల్సి వచ్చిందన్నారు

మీ స్వస్థలం, మీ ఉన్నత చదువుల గురించి చెబుతారా ?

పశ్చిమ గోదావరి జిల్లా రేలంగి మా స్వస్థలం. విశాఖకు తాగునీరందించే రైవాడ పథకంలో కీలక పాత్ర' నగరంలో పలు ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం

క్రియాశీలత, నిబద్ధత, నిత్య పర్యవేక్షణతో గుర్తింపు చెప్పుకొచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. ఇంజినీర్ జీవితం సంతృప్తినిచ్చిందా?

పదో తరగతి వరకూ ప్రభుత్వ హైస్కూల్లోనే అభ్యసించాను. ఇంటర్ ఏలూరు సిఆర్ఆర్ కాలేజీలో చదివాను. బిటెక్ శ్రీవేంకటేశ్వరా యూనివర్శిటీ (తిరుపతి)లో పూర్తిచేశాను. ఎం.టెక్ ఇంజినీరింగును విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో అభ్యసించాను. అసోసియేట్ ప్రొఫెసర్గా జి.పుల్లారెడ్డి ఇంజినీరింగు కాలేజీ (కర్నూలు)లో తొలుత జాబ్లో చేరాను.

ఉమ్మడి రాష్ట్రంలో ఏయే స్థాయిల్లో మీ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు?

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో 2012-2015 మధ్య కాలంలో మూడేళ్లపాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేశాను. విఎంఆర్డిఎ (విశాఖపట్నం)లో చీఫ్ ఇంజినీరుగా, 2014-2019 మధ్య సిఆర్డిఎ సిఈగా పని చేశాను. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్లలోనే అత్యధికంగా విధులను నిర్వర్తించాను. విశాఖలో ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియంను పూర్తి చేయడం జరిగింది. ఇక్కడే సాగర తీరంలో ఓసెన్ డెక్ పార్కు రూ.99 కోట్లతో టెండర్లను పిలిచాం. ఈ ప్రాజెక్టుకు త్వరలో సిఆర్ జెడ్ అనుమతులు రానున్నాయి. జీవీఎంసీలో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అభివృద్ధి పథంలో నడిపించి చీఫ్ ఇంజనీర్గా రిటైర్ అవుతున్నందుకు తృప్తిగా ఉందన్నారు.

జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 58 వినతులు

జీవీఎంసీ అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 58 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమీషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 58 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 09, 3వ జోన్ కు 07, 4వ జోన్ కు 07, 5వ జోన్ కు 10, 6వ జోనుకు 08, 8వ జోన్ కు 03, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 07, రెవెన్యూ విభాగమునకు 09, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 25, ఇంజినీరింగు విభాగమునకు 09, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 01 కలిపి మొత్తంగా 58 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డా.ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, చీప్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి,డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, కృష్ణారావు, గోవిందరావు, శ్రీనివాసరావు, కె.వి.ఎన్.రవి, పి.వి.వి సత్యనారాయణరాజు,డిడిహెచ్ ఎమ్.దామోదరరావు, యుసిడి పి.ఒ డి.లక్ష్మి, డిపిఓలు ఎం.వీ.డి ఫణి రామ్, ఎల్.సురేష్, సివిఒ డా.ఎన్.కిషోర్, బయాలజిస్ట్ సాంబమూర్తి, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, ఆర్.ఎఫ్.ఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం ఎంపీడీఓ ఆఫీస్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం : జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించుకొని విశాఖపట్నంలో జిల్లాలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో భాగస్వామ్యం కావ డానికి పద్మనాభం మండలంలో యోగాంధ్ర 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం వారోత్సవాల లో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశ మందిరంలో సోమవారం యోగా శిక్షణ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జూన్ 21న విశాఖపట్నం జిల్లాలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి పద్మనాభం మండలం నుంచి సుమారు 140 బస్సులలో, విశాఖపట్నం జిల్లా యోగా దినోత్సవ కేంద్రానికి సుమారు 6000 మందిని శిక్షణ ఇచ్చి తరలించనున్నట్లు తెలియజేశారు. ప్రతి సచివాలయ పరిధిలో 600 మంది కి పైగా వ్యక్తులకు యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించి విశాఖ జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కేంద్రానికి జూన్ 21న బయలుదేరనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన తెలియజేశారు. కృష్ణాపురం డిజిటల్ అసిస్టెంట్ భార్గవ్ యోగా శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, వివిధ పంచాయతీల నుంచి వచ్చిన అధికారులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీవీ అమ్మకాల్లో పదివేల కోట్ల రూపాయలు మైలు రాయిని దాటిన తొలి బ్రాండ్‌గా సామ్‌సంగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, 2024 క్యాలెండర్ సంవత్సరంలో తమ టెలివిజన్ వ్యాపారం 10000 కోట్ల రూపాయల అమ్మకాలను అధిగమించిందని ఈరోజు వెల్లడించింది. దీనితో భారతదేశంలో టెలివిజన్ పరిశ్రమలో ఈ ముఖ్యమైన మైలురాయిని సాధించిన మొదటి బ్రాండ్‌గా సామ్‌సంగ్ అవతరించింది. ప్రీమియం టీవీ ల విస్తృతమైన పోర్ట్‌ఫోలియో మరియు పెద్ద-స్క్రీన్, ఏఐ శక్తివంతమైన టెలివిజన్‌లకు పెరుగుతున్న డిమాండ్ ద్వారా 2025లో రెండంకెల వృద్ధిని సాధించగలమనే నమ్మకాన్ని సామ్‌సంగ్ తెలిపింది. "సామ్‌సంగ్ ఇండియాకు ఒక మైలురాయి సంవత్సరంగా 2024 నిలుస్తుంది. విలువ పరంగా, మేము రూ. 10000 కోట్ల టర్నోవర్‌ను సాధించాము. ప్రతి ఫ్రేమ్‌లోకి కొత్త ప్రాణం పోసే, ఇంట్లో సినిమాటిక్ శ్రేష్ఠతకు కొత్త ప్రమాణాలను నిర్దేశించే మా కొత్త ఏఐ టీవీ శ్రేణి ద్వారా మేము ఇప్పుడు ఈ సంవత్సరం రెండంకెల వృద్ధిని సాధించాలని కోరుకుంటున్నాము. ఏఐ - ఆధారిత స్క్రీన్‌ల యొక్క ఈ కొత్త యుగంతో, తదుపరి తరం టీవీ స్వీకరణను వేగవంతం చేయడం, భారతదేశ ప్రీమియం టెలివిజన్ విభాగంలో మా నాయకత్వాన్ని బలోపేతం చేయడం గురించి మేము నమ్మకంగా ఉన్నాము' అని సామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్ప్లే బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విప్లేష్ డాంగ్ అన్నారు.